
సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 3 । మే । 2024



గూడెంలో గూండాలకు చోటివ్వద్దు

తాడేపల్లిగూడెం ప్రశాంతతకు భంగం కలిగించే అరాచక శక్తులకు చోటివ్వద్దు.. **అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొట్టు సత్యనారాయణ అన్నారు.** 8లో ▸



వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ వైఎస్సార్‌సీపీలోకి చేరికలు జోరందుకున్నాయి. ఇతర పార్టీల నేతలు వచ్చి చేరుతున్నారు. 8లో ▸



కూటమిని ఓడించండి

రాష్ట్రంలో కూటమి పార్టీలు కుల గణనకు వ్యతిరేకంగా ఉన్నాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గూడూరి ఆరోపించారు. 8లో ▸

న్యూస్‌రీల్

నేడు నరసాపురంలో సీఎం జగన్ సభ

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



మాట్లాడుతున్న చీఫ్ విప్ ముదునూరి

నరసాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శుక్రవారం నరసాపురం పట్టణంలో నిర్వహిస్తున్న ఎన్నికల బహిరంగ సభను విజయవంతం చేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కోరారు. గురువారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ముఖ్యమంత్రి పర్యటన వివరాలు వెల్లడించారు. ఉదయం 9.30 గంటలకు సీఎం జగన్ హెలీకాప్టర్‌పై పట్టణంలోని టేలర్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారన్నారు. అక్కడి నుంచి నేరుగా కారులో స్టీమర్ రోడ్డు కనకదుర్గ గుడి ఆర్చి వద్ద ఏర్పాటుచేసిన సభావేదిక వద్దకు చేరుకుంటారని చెప్పారు. ఉదయం 11 గంటలకు బహిరంగ సభ అనంతరం సీఎం జగన్ తిరుగు ప్రయాణమవుతారన్నారు. రాష్ట్ర ప్రజల గుండెల్లో సీఎం జగన్ ఉన్నారని, వైఎస్సార్‌సీపీ అఖండ మెజార్టీతో మళ్లీ అధికారం కైవసం చేసుకుంటుందని ముదునూరి ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ మేనిఫెస్టోను ప్రజలు నమ్మడం లేదన్నారు. మాట ఇస్తే కచ్చితంగా అమలు చేసి చూపించే సీఎం జగన్ వెంటే ప్రజానీకం ఉందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు దొంగ మురళి, యూత్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు చదలవాడ మెర్లిన్ ఉన్నారు.

నర్సరీ కోర్సు ప్రారంభం



సర్టిఫికెట్ కోర్సు ప్రారంభ కార్యక్రమంలో వర్సిటీ వీసీ జానకీరామ్, ఉద్యోగులు

తాడేపల్లిగూడెం: ఉద్యాన రంగంలో నర్సరీ మొక్కలకు డిమాండ్ ఉందని ఉద్యాన వర్సిటీ వీసీ టి.జానకీరామ్ అన్నారు. వెంకట్రామన్న ఉద్యాన కళాశాలలో గురువారం 16 వారాల ఉద్యాన నర్సరీ నిర్వహణ కోర్సు ప్రారంభమైంది. వీసీ మాట్లాడుతూ నర్సరీలను స్థాపించాలనుకునే నిరుద్యోగ యువతకు ఈ కోర్సు ఉపయోగపడుతుందన్నారు. వర్సిటీ అధికారులు పద్మావతమ్మ, ఎం.మాధవి, ఆర్‌వీ సుజాత, టి.సుశీల, కిరణ్‌పాత్రో, వినయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం కార్యదర్శిగా గిడుతూరి



గిడుతూరికి నియామకపత్రం అందిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పద్మశాలీ సంఘం జిల్లా కార్యదర్శిగా ఏలూరుకు చెందిన గిడుతూరి వెంకట సత్యనారాయణను నియమిస్తూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వాసపల్లి నాగరాజు గురువారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల పరిధిలో పద్మశాలీ కులస్తుల అభివృద్ధి, సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు.

'నన్నయ'లో పీజీ కొత్త కోర్సు ప్రారంభం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఎంఎస్సీ జియో ఇన్ఫర్మేటిక్స్ కోర్సును నూతనంగా ప్రారంభిస్తున్నారు. కంప్యూటర్ సైన్స్, జియాలజీ, జియోగ్రఫీ, లైఫ్ సైన్సెస్, ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, అగ్రికల్చర్ సైన్సెస్, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్‌లలో ఏమైనా రెండు సబ్జెక్టులతో కోర్సు పూర్తి చేసిన సైన్స్ గ్రాడ్యుయేట్లు అర్హులు. ఏపీ పీజీ సెట్ ద్వారా మాత్రమే ఈ కోర్సులో చేరేందుకు అవకాశం ఉంటుంది. ఆసక్తి, అర్హత ఉన్న వారు ఈనెల 4వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. కోర్సులో చేరిన విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫెలోషిప్‌లు లభిస్తాయి. జియో ఇన్ఫర్మేటిక్స్ చేసిన విద్యార్థులకు పరిశోధనల్లో, ఉద్యోగ, ఉపాధిలోను అవకాశాలు మెండుగా ఉంటాయి. ఇస్రో, ఎఫ్ఎస్ఐ, జీఎస్ఐ, డీఆర్‌డీఓ, ఎన్ఐఆర్డీ వంటి ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు పొందడానికి అవకాశం ఉంటుంది. ఏపీ పీజీ సెట్ రాసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వర్సిటీ ఉప కులపతి ఆచార్య కె.పద్మరాజు కోరారు.

ప్రగతి పరవళ్లు

వచ్చని పొలాలు.. ఏపుగా కొబ్బరి చెట్లు.. నిండుకుండల్లా రొయ్యలు చెరువులు.. గలగలపారే గోదారి వంట కాలువలు.. ఆధ్యాత్మిక సౌరభాలు.. ఎటు చూసిన ఆహ్లాదకర వాతావరణం పశ్చిమగోదావరి సొంతం. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధికి బాటలు పడ్డాయి. జిల్లాకు తలమానికంగా నిలిచే ప్రాజెక్టులకు అంకురార్పణ జరిగింది. ప్రభుత్వ భవనాల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు సీఎం జగన్ సర్కారు ప్రాధాన్యమిచ్చింది. దీంతో జిల్లా అన్నిరంగాల్లో ప్రగతి సాధిస్తోంది. సమగ్రాభివృద్ధి దిశగా ముందుకు సాగుతోంది. – సాక్షి, భీమవరం



సంక్షేమ పథకాల లబ్ధి

	లబ్ధిదారులు	మొత్తం (రూ.కోట్లలో)
డీబీటీ రూపంలో..	34,89,446	10,002.50
నాన్ డీబీటీ రూపంలో..	17,23,890	1,362.07

ప్రభుత్వ భవనాల నిర్మాణం

భవనాలు	సంఖ్య	వ్యయం (రూ.కోట్లలో)
ఆర్‌బీకేలు	298	65.00
సచివాలయాలు	353	141.20
హెల్త్ క్లీనిక్‌లు	214	37.50
బల్క్‌మిల్క్ యూనిట్లు	10	175.00
డిజిటల్ లైబ్రరీలు	92	14.65

పశ్చిమాన నవశకం

- నరసాపురంలో ఆక్వా వర్సిటీ
- పాలకొల్లులో వైద్య కళాశాల
- పేదలకు రూ.11,364.57 కోట్ల సంక్షేమ లబ్ధి
- రూ.6,988.37 కోట్లతో అభివృద్ధి పనులు



తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం లేఅవుట్‌లో ఇళ్లు

అభివృద్ధి పరుగులు

- నరసాపురం బస్టాండును రూ.5 కోట్లతో కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశారు.
- బియ్యపుతిప్ప వద్ద రూ.430 కోట్లతో ఫిషింగ్ హార్బర్,
- రూ.490 కోట్లతో వశిష్ట గోదావరి వంతెన,
- తూర్పుగోదావరి జిల్లా విజ్జేశ్వరం నుంచి నరసాపురం వరకు రూ.1,400 కోట్లతో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు పనులు పట్టాలు ఎక్కేందుకు సిద్ధంగా ఉన్నాయి.
- రూ.220 కోట్లతో నరసాపురంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ,
- నరసాపురం, పాలకొల్లు, మొగల్తూరు, భీమవరం, యలమంచిలి, మండలాలకు ఉపయోగకరంగా రూ.113 కోట్లతో నిర్మించనున్న భారీ విద్యుత్ సబ్ స్టేషన్ పనులు టెండర్ దశకు చేరుకున్నాయి.

మౌలిక వసతులు

- భీమవరం జిల్లా కేంద్రంగా ఏర్పాటుచేయడంతో రూ.100 కోట్లతో పట్టణంలో రోడ్లు, డ్రెయిన్లు, మంచినీటి పైపులైన్ల పునరుద్ధరణ పనులు చేస్తున్నారు.
- యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన మూడు వంతెనలకు రూ.36 కోట్లతో అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయగా త్వరలో పనులు మొదలుకానున్నాయి.
- ఉండి నియోజకవర్గంలో రూ.24 కోట్లతో ఆకివీడులో మూడు, కాళ్ల, పాలకోడేరు, ఉండి మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం.
- జిల్లాలో 779 జగనన్న లేఅవుట్లలో 76,069 మంది పేదలకు ఇళ్ల స్థలాల మంజూరుతో పాటు ఇళ్ల నిర్మించే కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది.
- జిల్లాలో వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా 248 కస్టమ్ హైరింగ్ సెంటర్ల (సీహెచ్‌సీ) పరిధిలోని రైతులకు రూ.20.70 కోట్ల విలువైన వ్యవసాయ యంత్ర పరికరాలను 40 శాతం సబ్సిడీపై అందజేశారు.

వైద్య విద్యకు ప్రాధాన్యం

పాలకొల్లు మండలం దగ్గులూరులో రూ.475 కోట్లతో 61 ఎకరాల విస్తీర్ణంలో వైద్య కళాశాల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 2025–26 విద్యా సంవత్సరంలో ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 150 మంది విద్యార్థులు కళాశాలలో ఎంబీబీఎస్ విద్యను అభ్యసించనున్నారు.

ఆక్వా వర్సిటీ మణిహారం

తీరంలో మత్స్య ఎగుమతులు, మత్స్యసాగులో శాస్త్రీయ పద్ధతులు పెంచేందుకు నరసాపురం మండలం సరిపల్లి వద్ద మత్స్య యూనివర్సిటీ భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రూ.332 కోట్లతో 40 ఎకరాల స్థలంలో యూనివర్సిటీ పరిపాలన భవనం, హాస్టళ్లు, వీసీ చాంబర్ పనులు చేస్తున్నారు. రానున్న ఐదేళ్లలో మరో రూ.400 కోట్లు యూనివర్సిటీకి ఖర్చు చేయనున్నారు. ఓ వైపు నిర్మాణ పనులు జరుగుతుండగా ఈ విద్యా సంవత్సరం నుంచి లక్ష్మణేశ్వరం గ్రామంలోని తుపాన్ రక్షిత భవనంలో ఆక్వా కోర్సులు ప్రారంభించారు.

చెంతకే సేవలు

జగనన్న సురక్ష శిబిరాల ద్వారా జిల్లాలో 6,05,780 మంది లబ్ధిదారులకు ఎలాంటి సర్వీస్ చార్జీ లేకుండా 6,48,607 సర్టిఫికెట్లు జారీ చేశారు.

ప్రధాన రహదారులకు మహర్దశ



తాడేపల్లిగూడెంలో అభివృద్ధి చేసిన కేఎన్ రోడ్డు

- ఆచంట నియోజకవర్గంలోని పెనుగొండ–మార్టేరు రోడ్డును రూ.4 కోట్లతో అభివృద్ధి చేశారు.
- పెనుగొండ–ములపర్రు రోడ్డు విస్తరణ పనులను రూ.18 కోట్లతో చేపట్టారు.
- తణుకు–అత్తిలి రోడ్డును రూ.26 కోట్లతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నారు.
- తాడేపల్లిగూడెంలో రూ.36 కోట్లతో కోడేరు–నల్లజర్ల (కేఎన్ రోడ్డు)ను నాలుగు లైన్లుగా అభివృద్ధి చేశారు.
- ఆకివీడు మండలం పెదకాపవరం–కొల్లేరు, ఉండి మండలం పాములపర్రు, కాళ్ల మండలం జువ్వలపాలెం, కలవపూడి, బొండాడ రోడ్లను రూ.50 కోట్లతో అభివృద్ధి చేశారు.

సర్కారీ బడి.. కార్పొరేట్ సవ్వడి



మనబడి నాడు–నేడులో ఆధునికీకరించిన తణుకు జెడ్పీ హైస్కూల్ భవనం

జిల్లాలో మనబడి–నాడు నేడు కార్యక్రమంలో తొలివిడతగా రూ.116.13 కోట్లతో 497 పాఠశాలలు, రెండో విడతగా రూ.253.01 కోట్లతో 653 పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేశారు. బడుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిచ్చారు.



ఆక్వా యూనివర్సిటీ తరగతుల్లో విద్యార్థులు



మారంపల్లిలో రైతు భరోసా కేంద్రం

ఆరోగ్యమస్తు



పాలకొల్లులో నిర్మించిన 150 పడకల ఆస్పత్రి భవనం

జిల్లాలో కొత్తగా ఉండి మండలం కలవపూడి, భీమవరం రూరల్ పెన్నాడ అగ్రహారం, ఆకివీడు మండలం గుమ్ములూరు, మొగల్తూరు మండలం కాళీపట్నంలో కొత్త పీహెచ్‌సీలు మంజూరు చేశారు. సుమారు రూ.12 కోట్లతో మంచిలి, ముదునూరు, లంకలకోడేరు, మేడపాడు, ఆచంట వేమవరం, కాళ్ల పీహెచ్‌సీలకు ఆధునిక వసతులతో అభివృద్ధి చేస్తున్నారు. పాలకొల్లులో రూ.13.50 కోట్లతో 150 పడకల ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించి పనులు పూర్తి కావస్తుండగా త్వరలో వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకున్నారు. నరసాపురంలో 50 పడకల ఆస్పత్రిని 100 పడకల ఏరియా ఆస్పత్రిగా అభివృద్ధి చేశారు. భీమవరంలో రూ.40 కోట్లతో 100 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

పేదలపై చంద్రబాబు పగ

పింఛన్ పడిగాపులు

- ఈనెలా పింఛన్‌దారులకు తప్పని తిప్పలు
- జిల్లాలో 1,68,179 మంది ఖాతాలకు సొమ్ముల జమ
- 65,982 మందికి ఇంటికి వెళ్లి అందజేత
- బ్యాంకుల వద్ద వృద్ధుల బారులు
- కష్టాలు తెచ్చిపెట్టారంటూ చంద్రబాబుపై ఆగ్రహం



పెదతాడేపల్లి చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో పెన్షన్ కోసం వేచి ఉన్న వృద్ధులు

సాక్షి, భీమవరం: వలంటీర్ల సేవలకు చంద్రబాబు అండ్ బ్యాచ్ కల్పించిన అడ్డంకులతో ఈనెలా పింఛన్‌దారులకు తిప్పలు తప్పడం లేదు. ఇప్పటివరకు ఇంటి చెంతనే పింఛన్ అందుకున్న లబ్ధిదారులు గత నెలలో సచివాలయాల వద్ద క్యూ కడితే ఈనెల బ్యాంకుల వద్ద పడిగాపులు పడాల్సి వస్తోంది. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఐదేళ్లుగా ప్రతినెలా 1వ తేదీ వేకువజామునే లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి పింఛన్ సాయం అందిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. వలంటీర్ల సేవలకు జడిసిన విపక్ష నేత చంద్రబాబు తన అనుకూల వర్గం ద్వారా ఈసీకి ఫిర్యాదులు చేయించారు. వలంటీర్లపై ఈసీ ఆంక్షల నేపథ్యంలో ఏప్రిల్ నుంచి ఇంటికే పింఛన్ల పంపిణీ నిలిచిపోవడంతో చంద్రబాబు కాలం నాటి పింఛన్ వెతలు మళ్లీ మొదలయ్యాయి.

జిల్లాలో 2.34 లక్షల మంది..

జిల్లాలో 2,34,161 మంది లబ్ధిదారులకు ప్రతినెలా ప్రభుత్వం రూ.68.69 కోట్ల సాయం అందజేస్తోంది. గత నెలలో లబ్ధిదారులు సచివాలయాల వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ములు తీసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అరకొర మంది నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్లకు వెళ్లి అధికారులు అందజేయగా అధిక శాతం మంది సచివాలయాలకు వెళ్లాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా మరోమారు పచ్చ బ్యాచ్ ఫిర్యాదుతో అకౌంట్లు ఉన్న లబ్ధిదారులకు పింఛన్ సొమ్ములు నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమచేయాలని, లేనివారికి ఇళ్లకు వెళ్లి అందజేయాలని అధికారులకు ఆదేశాలు అందాయి.

బ్యాంకుల వద్ద పడిగాపులు

జిల్లాలో 1,68,179 మంది లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు సొమ్ములు జమచేయగా, ఖాతాలు లేని 65,982 మంది లబ్ధిదారులకు ఇళ్లకు వెళ్లి పంపిణీకి అధికారులు చర్యలు తీసుకున్నారు. సచివాలయ ఉద్యోగులు గురువారం నాటికి 87 శాతం మంది లబ్ధిదారులకు ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. ఇదిలా ఉండగా మండుటెండలో మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల్లోని బ్యాంకుల వద్దకు వెళ్లి నగదు తీసుకునేందుకు పల్లెల్లోని దివ్యాంగులు, వృద్ధులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కుటుంబసభ్యులను వెంటపెట్టుకుని ఆటోల్లో వెళ్లి పింఛన్ తెచ్చుకోవాల్సి వచ్చిందని పలువురు వాపోయారు. రెండు నెలల క్రితం వరకు వలంటీర్లు వేకువజామునే ఇంటికి వచ్చి చేతికందించే వారని, చంద్రబాబు అధికారంలోకి రాకుండానే తమను ముప్పతిప్పలు పెడుతున్నాడంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎండల్లో ఇబ్బంది



నా బ్యాంకు అకౌంట్ మనుగడ లేక ఈ రోజు పెన్షన్ తీసుకోలేకపోయాను. ఇంటి దగ్గరకు వలంటీర్లు పెన్షన్ తీసుకువచ్చిన రోజులే బాగుండేవి. ఇప్పుడు ఎండల్లో అనేక ఇబ్బందులు పడుతున్నాం. నాతోపాటు మరో ఇద్దరు సహాయకులుగా వచ్చినా డబ్బులు అందలేదు.

– చిట్టిరోజు సుబ్బలక్ష్మి, మామిడితోట, తాడేపల్లిగూడెం

ఇదంతా చంద్రబాబు వల్లే..



పింఛన్ తీసుకునేందుకు చాలా ఇబ్బంది పడాల్సి వస్తోంది. ప్రతి నెలా ఒకటో తారీఖున జగన్ బాబు పంపిన వలంటీర్లు మాకు ఇంటి వద్దనే పెన్షన్ ఇచ్చేవారు. ఇంతటి మండుటెండల్లో మమ్మల్ని ఇలా తిప్పడం వల్ల చంద్రబాబుకు ఏమొస్తుందో అర్థం కావడం లేదు.

– ఎం.మంగమ్మ, పెదతాడేపల్లి

చాలా ఇబ్బంది



చంద్రబాబు చేసిన పనితో చాలా ఇబ్బంది పడుతున్నాం. ఆపసోపాలు పడి బ్యాంకుకు వెళితే డబ్బులు పడలేదని చెప్పారు. అక్కడి నుంచి ఎండలో ఉసూరుమంటూ ఇంటికొచ్చాను. జగన్‌బాబు దయతో మొన్నటి దాకా ఇంటి వద్దనే పింఛన్ తీసుకునేవాళ్లం.

– ఎం.నాంచారమ్మ, మొగల్తూరు

పింఛన్ కోసం తిప్పలు



బ్యాంకులో క్లోజ్ చేసిన పాత అకౌంట్‌కు పింఛన్ సొమ్ములు జమయ్యాయి. నగదు తెచ్చుకునేందుకు బ్యాంకుకు వెళితే పాత అకౌంట్‌లో పడ్డాయని, మళ్లీ అకౌంట్ తెరిచేందుకు ఫొటోలు తెచ్చుకోమని తిప్పి పంపారు. మళ్లీ బ్యాంకుకు వెళ్లి తిప్పలు పడాల్సిందే.

– గవర భీముడు, రిక్షా కార్మికుడు, ఆకివీడు

వలంటీర్లతో ఇప్పించడమే మేలు



సీఎం జగన్ ప్రతినెలా ఒకటో తారీఖున ఉదయమే వలంటీర్ ద్వారా పింఛన్ అందించేవారు. టీడీపీ నేతల ఫిర్యాదుతో వలంటీర్ల ద్వారా పింఛన్ పంపిణీ నిలిచిపోయింది. గతనెలలో సచివాలయాల వద్ద ఇచ్చారు. ఇప్పుడు బ్యాంకు ఖాతాల్లో వేయడంతో ఇబ్బంది పడుతున్నాం.

– చక్కా సత్యానందం, ఇలపకుర్రు, యలమంచిలి మండలం

క్లుప్తంగా

భవిష్యకు ఇంటర్నేషనల్ చెస్ రేటింగ్



భీమవరంలో భవిష్యకు జ్ఞాపికను అందించి అభినందిస్తున్న కిషోర్

భీమవరం: భీమవరం పట్టణానికి చెందిన దాట్ల భవిష్య 1411 ఇంటర్నేషనల్ చెస్ రేటింగ్ కైవసం చేసుకుంది. అఖిల భారత చదరంగం సమాఖ్య, ప్రపంచ చదరంగం సమాఖ్య సంయుక్తంగా మే 1వ తేదీన విడుదల చేసిన చదరంగం ఫైడ్ రాపిడ్ రేటింగ్ జాబితాలో భవిష్య రేటింగ్ కైవసం చేసుకుందని నేషనల్ కోచ్ మాదాసు కిషోర్ చెప్పారు. గురువారం పట్టణంలోని అనసూయ చెస్ అకాడమీలో భవిష్యను అభినందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలో మొట్టమొదటి మహిళా రేటింగ్ చెస్ ప్లేయర్‌గా నిలవడం విశేషమన్నారు. భవిష్య చినఅమిరంలోని విశ్వకవి స్కూల్లో 8వ తరగతి చదువుతూ అనసూయ అకాడమీలో శిక్షణ పొందుతోందన్నారు.

రూ.లక్ష నగదు చోరీ

ఆకివీడు: పట్టణంలోని ఓ ఇంట్లో చోరీ జరిగి రూ.లక్ష నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. వివరాలిలా ఉన్నాయి. స్థానిక మట్టా వారి వీధిలో నివశిస్తున్న కొవ్వాడ రాంబాబు తన ఇంట్లో రూ. లక్ష రూపాయలు గుర్తుతెలియని వ్యక్తులు దోచుకుపోయారని గురువారం ఫిర్యాదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ జీ.దివాకర్ చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఎస్ఈబీ తనిఖీలు

ఏలూరు టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎస్ఈబీ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లాలో పలు చోట్ల గురువారం విస్తృతంగా తనిఖీలు చేశారు. 18 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. 8 చోట్ల కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. 16 కేసులు నమోదు చేసి 55 లీటర్ల నాటు సారా, 2800 లీటర్ల బెల్లపుఊట స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. 70.3 లీటర మద్యం స్వాధీనం చేసుకున్నారు. 12 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు.

గూడెంలో గూండాలకు చోటివ్వద్దు



ఇంటర్వ్యూ

- సీఎం జగన్ సహకారంతో అగ్రభాగాన తాడేపల్లిగూడెం నియోజకవర్గం
- ఐదేళ్లలో రూ.3 వేల కోట్ల విలువైన సంక్షేమం, అభివృద్ధి పనులు చేశాం
- నియోజకవర్గంలో క్రైం రేటును తగ్గించి ప్రశాంతత నెలకొల్పాం
- దుష్టశక్తులన్నీ ఏకమై కూటమిగా వచ్చాయి.. వారిని గెలిపిస్తే మళ్లీ రౌడీ రాజ్యమే
- 'సాక్షి'తో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

సాక్షి, భీమవరం: 'దుష్టశక్తులన్నీ ఏకమై కూటమిగా వచ్చాయి. సెటిల్మెంట్లు, దందాలతో తాడేపల్లి గూడెం ప్రశాంతతకు భంగం కలిగించే అటువంటి అరాచక శక్తులకు చోటివ్వద్దు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపాను. రూ.3 వేల కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశాను. రానున్న రోజుల్లో 'క్లీన్ తాడేపల్లిగూడెం' లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేశాం' అని చెప్పారు వైఎస్సార్ సీపీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభ్యర్థి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ. ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం, పార్టీ శ్రేణుల సమిష్టి కృషి, నియోజకవర్గ ప్రజల ఆదరాభిమానాలు ఎన్నికల్లో తనకు భారీ విజయాన్ని అందిస్తాయని కొట్టు సత్యనారాయణ ధీమా వ్యక్తం చేస్తున్నారు. 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

సాక్షి : వ్యాపారవేత్తగా రాణించిన మీరు రాజకీయాల్లోకి రావాలని ఎలా అనిపించింది?

మంత్రి కొట్టు సత్యనారాయణ : వ్యాపార రంగంలో దేశంలోనే అత్యున్నత స్థాయికి ఎదిగాను. ఉన్నదానితో సంతృప్తి చెంది ఆధ్యాత్మిక రంగం వైపు అడుగులు వేశాను. నాటి గూడెం పరిస్థితులను చక్కదిద్దేందుకు పెద్దలు నన్ను రాజకీయాల్లోకి రావాలని ఆహ్వానించారు.

సాక్షి : 30 ఏళ్ల రాజకీయ ప్రయాణం ఎలా సాగింది ?

మంత్రి కొట్టు సత్యనారాయణ : నా రాజకీయ జీవితంలో అనేక ఎత్తుపల్లాలు చూశాను. ఎన్నో ఎదురుదెబ్బలు తిన్నాను. గెలుపోటములతో నిమిత్తం లేకుండా నాటి నుంచి నేటి వరకు నన్ను నమ్ముకున్న, ఆదరించిన ప్రజలను అంటిపెట్టుకునే ఉన్నాను. అస్తవ్యస్త పరిస్థితులను చక్కదిద్దాను. 'అభివృద్ధికి, శాంతి భద్రతలకు' చిరునామాగా తాడేపల్లిగూడెం నియోజకవర్గ ముఖచిత్రాన్ని మార్చాను.

సాక్షి : ఐదేళ్లలో ప్రజల జీవన ప్రమాణాలు ఏ విధంగా మెరుగుపడ్డాయి ?

మంత్రి కొట్టు సత్యనారాయణ : రాష్ట్రంలో 70 ఏళ్ల పాలనలో సీఎం జగన్ ప్రస్థానం నూతన శకం. కొత్త పథకాలు, సంస్కరణలతో ప్రజల జీవన ప్రమాణాలు ఎంతో మెరుగుపర్చారు. రాష్ట్రంలో 12 శాతం ఉన్న పేదరికాన్ని 6 శాతానికి తగ్గించారు. రాష్ట్రాన్ని 26 జిల్లాలుగా విభజించి, కొత్త రెవెన్యూ డివిజన్లు, పల్లెల్లో గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి పాలనను పేదల గడప వద్దకు తీసుకువచ్చారు. దళారుల బెడద లేకుండా సంక్షేమ పథకాలను డీబీటీ ద్వారా నేరుగా ప్రజలకే చేరవేస్తున్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పాలనా వికేంద్రీకరణకు అధిక ప్రాధాన్యం ఇచ్చి సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించేందుకు కృషి చేస్తున్నారు. ఆయన సహకారంతోనే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించాను.

సాక్షి : తొలిసారి ఎమ్మెల్యేగా చేసిన పనులు ?

మంత్రి కొట్టు సత్యనారాయణ : 2004లో తొలిసారి మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యేగా గెలుపొందాను. 2009 వరకు ఐదేళ్లలో సుమారు రూ.700 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశాను. రాష్ట్రంలో పులివెందుల తర్వాత అభివృద్ధిలో తాడేపల్లిగూడెం రెండో స్థానంలో నిలిచింది. సౌత్ ఇండియాలో తొలి హార్టీకల్చర్ యూనివర్సిటీ స్థాపనకు కృషి చేశాను. ప్రస్తుతం నిట్ ఉన్న స్థలాన్ని ఆక్రమణల నుంచి రక్షించి ప్రభుత్వానికి అప్పగించాను. ప్రభుత్వ పాలిటెక్నిక్, వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలల ఏర్పాటు, ఆంధ్రా యూనివర్సిటీ పీజీ సెంటర్, ఫార్మసీ కాలేజ్ హాస్టల్ భవనాల నిర్మాణం, ఇతర విద్యా సంబంధమైన అనేక పనులు మంజూరు చేయించి వ్యాపార కేంద్రంగా మాత్రమే పేరున్న గూడెంను ఎడ్యుకేషనల్ హబ్‌గా మార్చాను. ఇప్పుడు కొత్తగా ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలను మంజూరు చేయించాను. ఏయూ క్యాంపస్‌లో పెడుతున్న ఈ కళాశాలలో వచ్చే విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు జరుగుతాయి.

సాక్షి : తాడేపల్లిగూడెం అభివృద్ధికి తీసుకున్న చర్యలు ఏమిటి?

మంత్రి కొట్టు సత్యనారాయణ : పారిశుద్ధ్య లేమి వల్ల తాడేపల్లిగూడెంకు దోమలగూడెం, దుమ్ముగూడెంగా పేరుండేది. స్వచ్ఛ గూడెం లక్ష్యంగా రూ.67 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు చేపట్టాం. 2009 నాటికి సగం పనులు పూర్తికాగా తర్వాత వచ్చిన ఎమ్మెల్యేలు ఆ పనులను గాలికొదిలేశారు. మళ్లీ నేను వచ్చాక వాటిని పూర్తిచేసి అదనంగా సుమారు రూ.200 కోట్లు మంజూరు చేయించాను. ఈ పనులు ప్రారంభమయ్యాయి. రానున్న రెండు, మూడేళ్లలో పూర్తయి పరిశుభ్రతకే మారుపేరుగా పట్టణం నిలుస్తుంది. టూటౌన్‌లో యూఎస్‌డీ కొత్త ప్రాజెక్టుకు రూ.112 కోట్లు మంజూరు చేయించాను. ఎన్నికల అనంతరం వాటిని ప్రారంభిస్తాం. పెంటపాడు మండలంలో అనేక రోడ్లు, వంతెనలు నిర్మించి బాహ్య ప్రపంచంతో రవాణా సంబంధాలు మెరుగుపరిచాను. రూరల్‌లోనూ బీటీ రోడ్లు, ప్రతి గ్రామంలో తాగునీటి సదుపాయం అన్నీ నా హయాంలో జరిగినవే. తాడేపల్లి గూడెం ఆసుపత్రి స్థాయి పెంచి మెరుగైన వసతులు కల్పించాను. రాష్ట్రంలో కొత్తగా మూడు ప్రాంతీయ చిన్న పిల్లల ఆసుపత్రులు ఏర్పాటు చేస్తుండగా, వాటిలో ఒకటి గూడెంకు మంజూరు చేయించాను. గూడెంను పోలీస్ సబ్ డివిజన్ స్థాయికి పెంచాను.

సాక్షి : పట్టణంలో ప్రశాంతతను నెలకొల్పేందుకు తీసుకున్న చర్యలు ?

మంత్రి కొట్టు సత్యనారాయణ : గతంలో పట్టణంలోని ప్రతి సెంటర్లోనూ పేకాట క్లబ్బులు, నోట్ల మార్పిడి, ఆడవారిపై అఘాయిత్యాలు, టీజింగ్, ప్రైవేటు సెటిల్మెంట్లు, రౌడీయిజం, గూండాయిజం, హత్యలు, మద్యం మాఫియా ఆగడాలతో తాడేపల్లిగూడెం అట్టుడికిపోయేది. నేను ఎమ్మెల్యేగా వచ్చాక వీటన్నింటిపై ఉక్కుపాదం మోపాను. శాంతిభద్రతలను పూర్తిగా అదుపులోకి తెచ్చాను. 2009–2019 మధ్యకాలంలో నేను అధికారంలో లేని సమయంలో కొన్ని శక్తులు మళ్లీ తెరపైకి వచ్చి ప్రైవేట్ సెటిల్‌మెంట్లు, దందాలు చేయడం ప్రారంభించాయి. 2019 నుంచి వాళ్ల ఆటలు సాగనివ్వకపోవడంతో ఇప్పుడు వారంతా కూటమిగా జతకట్టి నాపై తలపడుతున్నారు.

సాక్షి : ట్రాఫిక్ సమస్యను ఏ విధంగా పరిష్కరించారు ?

మంత్రి కొట్టు సత్యనారాయణ : తాడేపల్లిగూడెం ట్రాఫిక్ సమస్య పద్మవ్యూహంలా ఉండేది. గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి ప్రజలు నరకయాతన అనుభవించేవారు. గూడెం చుట్టూ నాలుగు వరుసల రహదారులు, రెండో ఫ్లైఓవర్ నిర్మించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాను. ఈ ఐదేళ్లలో నియోజకవర్గంలో రూ.120 కోట్ల విలువైన రోడ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. నియోజకవర్గంలోని ఎర్రకాలువపై ఐదు వంతెనలు, త్యాజంపూడి, బాదంపూడి, ప్రత్తిపాడు, చిలకంపాడు, వెంకట్రామన్నగూడెం తదితర నియోజకవర్గ పరిధిలోని ఇంటర్నల్ లింకు రోడ్లు, వంతెనలు ఇవన్నీ నా హయాంలో జరిగినవే.

సాక్షి : ప్రత్యర్థులు మీపై చేస్తున్న ఆరోపణలపై మీ స్పందన ?

మంత్రి కొట్టు సత్యనారాయణ : ఆరోపణలు చేస్తున్న వారిని నేను సవాల్ చేస్తున్నా.. ఒక్కటైనా నిరూపించాలి. రాజకీయాల్లోకి వచ్చే టప్పటికి నా ఆర్థిక స్థితి, కుటుంబ నేపథ్యం .. వారి కుటుంబ నేపథ్యం, ఆర్థిక స్థితి చూడమని ప్రజలను కోరుతున్నా. వాళ్ల అరాచకాలు, అకృత్యాలు, రౌడీయిజం, గూండాయిజం, సెటిల్మెంట్లు చేసి పైకొచ్చారు. బలహీనుల ఆస్తులు కాజేశారు. వ్యాపారం పేరిట ప్రజలను, ప్రభుత్వాన్ని దోచేసి కోట్లు కూడబెట్టారు. పేకాట క్లబ్బులు, గెస్ట్‌హౌస్‌ల నిర్వహణ వారి నిత్యకృత్యం. ఐదేళ్ల మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసిన నేటి ప్రత్యర్థి తన హయాంలో పట్టణానికి చేసిన ఒక్క పని చెప్పమనండి? లైట్ల కుంభకోణం, ప్రైవేటు లేఅవుట్లకు అనుమతి, దందాలు, వసూళ్ల వంటి అనేక అవినీతి కార్యక్రమాలకు పాల్పడ్డారు. ఇక అతని వ్యక్తిగత ప్రవర్తన గురించి చెప్పినా స్థాయిని దిగజార్చుకోలేను.

సాక్షి : నియోజకవర్గ ప్రజలను మీరు కోరేది ?

మంత్రి కొట్టు సత్యనారాయణ : గూడెంలో చరిత్రలో నాదని చెప్పుకోవడానికి మైలురాళ్లగా నిలిచే పనులు, రానున్న తరాలకు ఉపయోగపడే పనులు పదుల సంఖ్యలో ఉన్నాయి. నా హయాంలో చేపట్టిన అభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణ తదితర అంశాలను గుర్తించి ఆలోచించాలని ప్రజలను వేడుకుంటున్నాను.

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు



శ్రీరంగనాథరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన పెనుగొండ దక్షిణపేట వాసులు



ముదునూరి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన కాపు సంఘం యువకులు

పెనుగొండ: పెనుగొండ మండలం కొఠాలపర్రుకు చెందిన సుమారు 50 మంది తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన నాయకులు తూర్పుపాలెం కార్యాలయంలో ఆచంట అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో గురువారం చేరారు. వీరికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వీరిలో కాయల జగదీశ్వరరావు, కాయల తులసిరావు, కాయల గోపాలం, చిక్కాల సుబ్రహ్మణ్యం, నూకల సూర్యచంద్రరావు, కంతేటి చిన్న నాగేశ్వరరావు, దివి శంకరం నాయుడు, దివి బన్నీ నాయుడు, దివి అయ్యప్ప, దివి సాయి మణికంఠ, దివి రామకృష్ణ, దివి కేశవరావు, వడగన సత్యనారాయణ, తోలేటి వెంకటేష్, బండి వెంకన్న, ఆచంట ప్రసాద్, నౌబత్తుల సురేష్, మానికిరెడ్డి శ్రీను, కొమ్మల భాస్కర్, కొమ్మిరెడ్డి కేశవరావు, గాలి దేవర మణికంఠ, అడపా వాసు, ఆచంట బాబురావు, తోలేటి అరుణ్, ఆచంట శ్రీనివాస్, ఆచంట బుజ్జి, ఆచంట ఏసు, కాకిలేటి కేశవరావు, సింగం రాఘవులు, మానేపల్లి శివ, ఆచంట శ్రీను, ఆచంట సీతారామస్వామి, తోలేటి సుబ్రహ్మణ్యం, ఆచంట గణపతి, ఆచంట శ్రీను, ఆచంట సూర్యనారాయణ, ఆచంట దాసు, ఆచంట పెద్దిరాజు, ఆచంట నవీన్, ఆచంట చిన్న గణపతి, ఆచంట కేశవరావు, ఆచంట శివాజీ ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పుతినీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ తోలేటి శ్రీను, జిల్లా కార్యదర్శి కాకిలేటి బాపి రాజు, కడలి శ్రీను, దివి గణపతి, కొమ్మిరెడ్డి హిమదత్తు, ఆచంట వెంకటనారాయణ పాల్గొన్నారు.

కాపు సంఘం నాయకుల చేరిక

పెనుగొండ దక్షిణపేటకు పలువురు సంఘ నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. గురువారం తూర్పుపాలెంలోని కార్యాలయంలో ఆచంట ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు వారికి వైఎస్సార్ సీపీ కండువాలు కప్పారు. వీరిలో సంఘ నాయకులు నల్లపూడి పోతురాజు, వెన్నపు శ్రీనివాస్, తణుకుల ఆనందరావు, ఎత్తు ప్రసాదు, కారు శ్రీనివాసు, కుసుమే కాంతా రావు, పి.రామ్ జి.రమణ ఉన్నారు.



ఎమ్మెల్యే గ్రంధి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన పంజావేమవరం టీడీపీ, జనసేన నేతలు

ఎమ్మెల్యే ముదునూరి సమక్షంలో..

నరసాపురం: వైఎస్సార్‌సీపీ నేత బళ్ల తాతాజీ ఆధ్వర్యంలో స్థానిక 31వ వార్డు నుంచి 50 మంది కాపు యువకులు జనపార్టీని వదిలి ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. గురువారం బళ్లతాతాజీ నివాసం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తోట రాంబాబు, పూసల శ్రీనివాస్, పరిమి రాకేష్, బళ్ల చిన్ని, చేగొండి రాజు, బళ్ల సాయి, వేగి తేజ, మాదాసు అరవింద్, చేగొండి మల్లేశ్వరరావు, భూపతి సేతురామ్, పంజా రాకేష్, ఉంగరాల మణికంఠ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కేంద్ర పాలకమండలి సభ్యుడు పీడీ రాజు, వైకేఎస్, బళ్ల కృష్ణ, బళ్ల సోమశేఖర్, మండెల కొండబాబు, తోట సుబ్బారావు, బళ్ల అంజిబాబు, కడియం రామకృష్ణ, నడపన పాండు, మాదిరెడ్డి ఏసు, తుమ్మూరి నాగేశ్వరరావు, మారెళ్ల రామకృష్ణ తదితరులు ఉన్నారు.

వీరవాసరంలో.

వీరవాసరం: వైఎస్సార్ సీపీ భీమవరం ఎమ్మెల్యే అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో గురువారం పంజావేమవరం గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు 50 మంది వైఎస్సార్ సీపీలో చేరారు.

కుల గణనను వ్యతిరేకించే కూటమిని ఓడించండి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు పిలుపు



ఆకివీడు: రాష్ట్రంలో కూటమిగా ఏర్పడిన టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు కుల గణనకు వ్యతిరేకంగా ఉన్నాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు ఆరోపించారు. స్థానిక ఏఎంసీ చైర్మన్ రసూల్‌బీబీ నివాసంలో గురువారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ కులగణనకు బీజేపీ పూర్తి వ్యతిరేకంగా ఉందన్నారు. కూటమిగా ఏర్పడిన ఆ పార్టీలు కులగణనకు బీజేపీని ఒప్పించగలరా అని డిమాండ్ చేశారు. తాము కులగణనకు వ్యతిరేకమని బీజేపీ చెబుతున్నప్పటికీ ఆ పార్టీతో కూటమి కట్టిన జనసేన, టీడీపీలు బయటకు రావాలని డిమాండ్ చేశారు. 2019లో రాష్ట్రంలో ప్రజలిచ్చిన తీర్పును 2024లో పునరావృతం చేయనున్నారని చెప్పారు. బీసీల్ని మోసగించిన చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో బీసీ కులస్తులు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. అమలు చేయలేని వాగ్దానాలతో కొన్ని పార్టీలు ఎన్నికలకు సిద్ధమైతే, అమలుజేసిన పథకాల్ని మరింత పటిష్టంగా అమలుజేసేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. బీసీలకు వైఎస్సార్ సీపీ అగ్రస్థానం కల్పించిందని చెప్పారు. ఎమ్మెల్యే, ఎంపీ స్థానాల్ని అధికంగా బీసీలకు కేటాయించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బీసీలంతా నమ్ముతున్నారని చెప్పారు. ఏఎంసీ చైర్మన్ రసూల్‌బీబీ మాట్లాడుతూ బీసీలకు సముచిత స్థానం కల్పించిన వైఎస్సార్ సీపీకి వచ్చే ఎన్నికల్లో బీసీలంతా మద్దతు పలికి అత్యధిక మెజార్టీ కలిస్తారని చెప్పారు. ఉండి అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు, ఎంపీ అభ్యర్థి గూడూరు ఉమాబాలను గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు ఊడిగ శ్రీనివాస్, తోట శివాజీ, రాజులపూడి వెంకటేశ్వరావు, గంగయ్య, సందా కేశవరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులపై చింతమనేని వర్గీయుల దాడి

పెదవేగి: వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అనుచరులు మరోసారి దాడులకు తెగబడ్డారు. వివరాల్లోకి వెళితే.. దెందులూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరి గురువారం కొప్పాకలో ఎన్నికల ప్రచారం నిర్వహించగా, ఈ ప్రచారంలో విజయరాయికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు మట్టా శంకర్, మరి కొందరు హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం వీరు విజయరాయికి తిరిగొస్తుండగా, అప్పటికే గ్రామంలో ప్రచారం చేస్తున్న చింతమనేని ప్రభాకర్ వీరిని ఉద్దేశించి మాట్లాడుతూ మీరేంట్రా జెండాలు కట్టుకుని తిరుగుతున్నారంటూ బూతులు తిడుతూ అతని అనుచరులు కొడాలి శంకర్ తదితరులను రెచ్చగొట్టి దాడి చేయించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల బైక్‌లపై ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి చిత్రాలు ఉండటాన్ని చూసి అసహనం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు విచక్షణా రహితంగా దాడి చేయడంతో ఆరుగురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే తమ అనుచరులపైనే దాడి చేశారంటూ ఆరోపిస్తూ చింతమనేని తన వర్గీయులతో కలిసి విజయరాయిలో ధర్నా డ్రామాకు తెరతీశారు. సమాచారం అందుకున్న పోలీసులు పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఈ ఘటన అనంతరం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి టీడీపీ వర్గీయులు వెళ్లగా, ఏలూరు టూటౌన్ ఎస్సై సాధిక్ ఎన్నికల సమయంలో ఇంత మంది ఆస్పత్రిలో ఉండకూడదని కొంతమందిని ఆసుపత్రి నుంచి పంపే ప్రయత్నం చేయగా, ఎస్సైపై కేకలు వేస్తూ చింతమనేని వర్గీయులు హడావిడి చేశారు.

క్లుప్తంగా

సీఎంను కలిసిన వడ్డి రఘురాం


ఏలూరులో సీఎంను కలిసిన వడ్డి రఘురాం

తాడేపల్లిగూడెం: ఏలూరులో బుధవారం బహిరంగ సభకు వచ్చిన ముఖ్యమంత్రిని కలిసినట్టు ఆప్కాడా వైస్‌చైర్మన్ వడ్డి రఘురాం గురువారం తెలిపారు. ఆక్వా రంగానికి సంబంధించిన పలు సమస్యలను గురించి సీఎంతో మాట్లాడానన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి సీఎం సానుకూలంగా స్పందించారన్నారు. ఆక్వా రంగం తరఫున సీఎంకు ధన్యవాదాలు తెలిపారు.

‘ఉపాధి’ కూలీలకు పనిముట్లు అందజేయాలి


నీలాద్రిపురం గ్రామంలో కూలీలతో మాట్లాడుతున్న కండెల్లి సోమరాజు

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి హామీ పథకం కూలీలకు పనిముట్లు అందజేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు అన్నారు. గురువారం మండలంలోని నీలాద్రిపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం పని ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొత్త గ్రూపులకు పనిముట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని కూలీలు వాపోయారు. అలాగే కూలీలకు కనీసం మంచినీటి సౌకర్యం ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఉపాధి కూలీలకు పనిముట్లు, మంచినీటికి సొమ్ములు ఇవ్వాలని కూలీలు కోరారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం


డైమండ్స్ ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న లయన్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పేదలకు అండగా లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయమని లయన్స్‌క్లబ్ జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు అన్నారు. క్లబ్ సేవా కార్యక్రమంలో భాగంగా జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, సరోజినిల సహకారంతో మహిళలకు చీరలు, లయన్ సత్య స్వరూప్, శశికళ సహకారంతో బియ్యం, కూరగాయలు పంపిణీ జరిగింది. మాణిక్యాలరావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రతి నిమిషం ఎదొక సేవా కార్యక్రమం జరిపే ఏకైక సంస్థ అంతర్జాతీయ లయన్స్ క్లబ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డైమండ్స్ క్లబ్ అధ్యక్షుడు కొప్పిశెట్టి రమణయ్య, జామి సత్యనారాయణరాజు, పల్లెల శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథపురంలో ఎన్నికల ప్రచారం


జగన్నాథపురం గ్రామంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అభ్యర్థి కొట్టు సత్యనారాయణను గెలిపించాలని ఇంటింటికి ప్రజల్ని ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా గత ఐదేళ్ల కాలంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఎంపీపీ పొనుకుమాటి శేషులత, సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక, ఎమ్పీటీసీ నార్ని నాగులు, చిట్టూరి బాపన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన


అధికారులకు సూచనలు చేస్తున్న శైలేష్‌కుమార్

తణుకు: తణుకు నియోజకవర్గం పరిధిలోని అత్తిలి, ఇరగవరం, తణుకు రూరల్, పట్టణ పోలీసు స్టేషన్ల పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను జిల్లా ప్రత్యేక పోలీసు పరిశీలకులు శైలేష్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఆయా కేంద్రాలవద్ద ఎలాంటి అల్లర్లు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. ఆయన వెంట సీఐలు కాళీచరణ్, ఎం.నాగరాజు, ఇరగవరం ఎస్సై డి.ఆదినారాయణ ఉన్నారు.

కేంద్ర ఆస్పత్రి సేవలు అజరామరం

- సేవల్లోను, పరిశుభ్రతలోను పలు అవార్డులు అందుకున్న వైనం
- క్యాన్సర్ రోగులకు వైద్యసేవలు
- ప్రభుత్వ పనితీరుపట్ల హర్షం వ్యక్తం చేస్తున్న రోగులు


తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని ఎస్ఎన్‌సీయూ విభాగంలో చికిత్స పొందుతున్న నవజాత శిశువులు


తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో గర్భిణుల హైరిస్కు కేసుల్లో సేవలందించే హెచ్‌డీయూ విభాగం


గంటకు 400 రక్త పరీక్షలు నిర్వహించే అధునాతన పరికరం

తణుకు అర్బన్: తణుకు చుట్టుపక్కల 100 గ్రామాలకు పెద్దాసుపత్రిగా 150 పడకలతో తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి అందిస్తున్న వైద్యసేవలు అజరామజరంగా నిలుస్తున్నాయి. ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవలు పేదల పాలిట సంజీవనిలా ఆదరిస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యానికి అత్యధిక ప్రాధాన్యతనివ్వడంతో వైద్యానికి సంబంధించిన సౌకర్యాలు మెరుగుపడ్డాయి. 100 పడకలతో తణుకు ఏరియా ఆస్పత్రిగా ఉండే ఆస్పత్రిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో రాష్ట్ర మంత్రి కారుమూరి జిల్లా కేంద్ర ఆస్పత్రిగా మారుస్తూ 150 పడకలను అందుబాటులోకి తీసుకువచ్చారు. అంతే కాకుండా అవసరమైన వైద్యులు, సిబ్బంది, మౌలిక వసతులను రూపకల్పన చేశారు. దీంతో ఆస్పత్రికి అవసరమైన పరికరాలన్నీ క్యూకట్టాయి. ప్రతి విభాగంలోను అత్యాధునిక వైద్యకరాలు అందుబాటులోకి రావడంతో ప్రైవేటు వైద్యంలో ఖరీదైన వైద్యం నేడు తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఉచితంగా అందుతున్నందుకు రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గతం శూన్యం.. నేడు ఘనం

2019కి ముందు తణుకు ఏరియా ఆస్పత్రిగా ఉన్న సమయంలో ప్రతివిభాగంకూడా వైద్యసేవలకోసం రోగులు క్యూకట్టే పరిస్థితి ఉండేది. ఏరియా ఆస్పత్రికి సరిపడా వైద్యులు, సిబ్బంది, అధునాతన పరికరాలు అందుబాటులో లేకపోవడంతో ఎక్సరేలు, ఈసీజీలు, రక్తపరీక్షల విభాగాలవద్ద రోగులు గంటల తరబడి వేచిచూడాల్సి వచ్చేది. వైద్యపరీక్షలకు ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్స్‌కు వెళ్లాల్సివచ్చేది. కానీ నేడు ఆస్పత్రిలో సమకూర్చిన పరికరాల కారణంగా రోగులు నిలబడే పరిస్థితులులేకుండాపోయా యి. రావడంతోనే వైద్యం, పరీక్షలు నిర్వహించుకుని వైద్యుల వద్దకు వెళ్తున్నారు. ఖరీదైన రక్తపరీక్షలు ఆస్పత్రిలోనే ఉచితంగా చేస్తున్నారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలకు, పచ్చదనానికిగాను పలు అవార్డులు నేడు అందుకున్న పరిస్థితి ఉంది.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక వైద్యం



తణుకు ఏరియా ఆస్పత్రిగా ఉన్న ప్రభుత్వాసుపత్రిని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిగా మార్చి అవసరమైన సౌకర్యాలు అందజేశాం. పేదల వైద్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చాలా ప్రాధాన్యతనిచ్చారు. అదే స్ఫూర్తితో అన్ని విభాగాల్లోను వైద్యులు, సిబ్బందిని నియమించారు. ముఖ్యంగా కార్పొరేట్ ఆస్పత్రుల్లో కూడా లేని అధునాతన పరికరాలు ప్రభుత్వ ఆస్పత్రులకు సీఎం అందజేశారు. దీంతో తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సాంకేతికంగా అధునాతన పరికరాలను అందుబాటులో ఉంచి రోగులకు సత్వర వైద్యం అందజేస్తున్నాం.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, రాష్ట్ర మంత్రి

తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి అన్నింటా ఫస్ట్



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది సత్వర వైద్యం అందిస్తున్నారు. మంత్రి కారుమూరి వైద్యవర్గాలకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. దీంతో ఎవరి పని వారు సక్రమంగా నిర్వర్తిస్తున్నారు. ముఖ్యంగా రక్తపరీక్షల విభాగంలో ఏర్పాటుచేసిన అత్యాధునిక పరీక్షలతో రోజుకు వెయ్యికి పైగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ 58 నెలల కాలంలో పేదలకు ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందజేయడం చాలా తృప్తినిచ్చింది.

– డాక్టర్ దాట్ల సుందరరామరాజు, తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు

తణుకు ఆస్పత్రిలో వైద్యం భేష్



తణుకు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవలు చాలా బాగున్నాయి. 9 రోజుల క్రితం నాకు నార్మల్ డెలివరీ అయి పాప పుట్టింది. అయితే ఉమ్మనీరు తాగిన కారణంగా పాపను వైద్యులు ఒక రోజు ఎస్ఎన్‌సీయూ విభాగంలోని బాక్సులో ఉంచి ఆక్సిజన్ అందిస్తూ చాలా బాగా చూశారు. ఇప్పుడు మా పాప చాలా ఆరోగ్యంగా ఉంది.

– అనూషాబేగం, బాలింత, తీపర్రు

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ లబ్ధి


పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఈలి నాని

తాడేపల్లిగూడెం అర్బన్: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగించారు. మళ్లీ అతనినే సీఎంగా చూడాలని ప్రజలు ఉవ్విళ్లూరుతున్నారని మాజీ ఎమ్మెల్యే ఈలి వెంకట మధుసూదనరావు (నాని) తెలిపారు. పట్టణంలోని 21, 20, 22, 23 వార్డుల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా వార్డుల్లో ఈలి నాని మాట్లాడుతూ ఏ నాయకుడు చేయని విధంగా జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారన్నారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోలో చెప్పిన హామీలన్నింటినీ నెరవేర్చారన్నారు. అందుకే ధైర్యంగా ప్రతి గడపకూ వెళ్లి ఓటు అడుగుతున్నామన్నారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. ఈనెల 13 నిర్వహించే ఎన్నికల్లో కొట్టును మళ్లీ గెలిపించుకుంటే మన తాడేపల్లిగూడెం పట్టణంతోపాటు నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అదేవిధంగా నరసాపురం పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేస్తున్న గూడూరి ఉమాబాలను గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో ఈలి నానితో పాటు యెగ్గిన నాగబాబు, వెలనాటి సత్తిబాబు, చిటికన ప్రసాద్, బోణం విజయనిర్మల, దింటకుర్తి లీలావతి, రాజా త్రినాథ్, అరమిల్లి రవి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్తు జగన్‌తోనే సాధ్యం

- మంత్రి కారుమూరి
- మరోసారి మీ ముందుకు వచ్చా ఆశీర్వదించండి అంటూ విజ్ఞప్తి
- అత్తిలి మండలంలో భారీ బైక్, కార్ల ర్యాలీతో ఎన్నికల ప్రచారం


అత్తిలి మండలం మంచిలిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు


అత్తిలి మండలం ఆరవల్లిలో బైక్ ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు


ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

అత్తిలి: గతంలో ఏ ప్రభుత్వంలో చేయని సంక్షేమ కార్యక్రమాలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు అందించామని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చెప్పారు. గురువారం అత్తిలి మండలం మంచిలి, ఆరవల్లి, దంతుపల్లి, ఉనికిలి, లక్ష్మీనారాయణపురం, స్కిన్నెరపురం, కంచుమర్రు, ఈడూరు, కొమ్మర, పాలూరు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ తణుకు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి కారుమూరి నాగేశ్వరరావు, నర్సాపురం ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల భారీ మోటారు సైకిళ్లు, కార్లతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ సంక్షేమ ఫలాలు పారదర్శకంగా అందాలన్నా, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి గుమ్మంలోకి పింఛన్ రావాలన్నా, మళ్లీ సీఎంగా జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. గతంలో 600 హామీలు అమలు చేస్తానని చెప్పి, ఎగ్గొట్టిన చంద్రబాబును నిన్ను నమ్మం బాబూ అంటూ ప్రజలు వాపోతున్నారన్నారు. 99 శాతం హామీలు నెరవేర్చి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని, మేనిఫెస్టోలో చెప్పినవి, చెప్పనవి కూడా అమలు చేసి చూపించారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథాలైన భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావించి 99 శాతం హామీలను నెరవేర్చారన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలతో పాటు మహిళా సాధికారితకు జగనన్న ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. నర్సాపురం పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల మాట్లాడుతూ గత ప్రభుత్వాలు బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకున్నాయే తప్ప రాజకీయంగా ఎక్కడా ప్రాధాన్యత కల్పించలేదన్నారు. బీసీ సామాజిక వర్గాన్ని గుర్తించిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే అని తెలిపారు. మీరెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి తణుకు ఎమ్మెల్యేగా కారుమూరి నాగేశ్వరరావును, ఎంపీగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంబీసీ చైర్మన్ పెండ్ర వీరన్న, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, సొసైటీ అధ్యక్షుడు సత్తిపండురెడ్డి, వట్టికూటి సూర్యనారాయణ, కునాధరాజు శ్రీహరిరాజు, సర్పంచ్‌లు చింతారామయ్య, అడ్డాల భానులలిత మహాలక్ష్మి, మంతెన రామలింగరాజు, తానుకొండ దయామణి, ఎంపీటీసీ సభ్యులు దారం శిరీషా, ఆదారి శ్రీనివాస్, దొమ్మేటిరమ్య, పురుషోత్తపు నాగ శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ కూనపరెడ్డి జయరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్తి వెంకట శ్రీనివాసరెడ్డి, గొలుగూరి శ్రీరామారెడ్డి, తమ్మాబత్తుల సత్యనారాయణ, రాంపండు, రాగిరెడ్డి రాజేంద్రప్రసాద్, బొడ్డేటి మురళి, దారాబత్తుల రామాంజనేయులు, వట్టికూటి రాము, సత్తి గణేష్ రెడ్డి, రాపేటి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి జగన్

తణుకు టౌన్: అర్హులందరికీ ఇంటి గడప వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు కోరారు. బుధవారం రాత్రి తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆర్యవైశ్యులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి కారుమూరి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ రాష్ట్రంలో గత 58 నెలలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ, అభివృద్ధిని రెండు కళ్లుగా పరిపాలన సాగించారని చెప్పారు. గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీలు చుండ్రు శ్యామల, గ్రామ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జీవీఆర్ఎస్ కుమార్, గౌరవ అధ్యక్షుడు ఎస్వీఎస్ గుప్తా, కార్యదర్శి మండ నగరేశ్వర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో ప్రతి కుటుంబానికీ మేలు


పెదతాడేపల్లి సెంటర్‌లో నాయకులతో మాట్లాడుతున్న కొట్టు సత్యనారాయణ

- వైఎస్సార్ సీపీ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ


పెదతాడేపల్లి గ్రామంలో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్ సీపీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గత ఐదేళ్లలో ప్రతి కుటుంబానికి మేలు చేకూరిందని వైఎస్సార్ సీపీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని పెదతాడేపల్లి, వెంకట్రామన్నగూడెం, జగ్గన్నపేట, రామన్నగూడెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 59నెలల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా 2.70లక్షల కోట్లను నేరుగా వివిధ పథకాల కింద లబ్ధిదారుల ఖాతాలకు సొమ్ము జమ చేశారన్నారు. ఏ పార్టీకి ఓటు వేశారన్నది చూడకుండా అందరికీ లబ్ధి చేకూర్చారన్నారు. తద్వారా వినూత్నమైన పాలనను అందించారని కొనియాడారు. వ్యవసాయానికి తొమ్మిది గంటలు నిరంతరాయంగా విద్యుత్‌ను అందజేస్తున్నామన్నారు. దీంతో పంటలు సమృద్ధిగా పండుతున్నాయన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. రైతులకు ఇంత చేస్తున్న చంద్రబాబుకు మద్దతు పలకడం దారుణమన్నారు. చంద్రబాబు పాలనలో ఏ ఒక్క రైతుకు న్యాయం జరగలేదన్నారు. వైఎస్సార్, జగన్ పాలనలో రైతులు ఎంతగానో బాగుపడ్డారన్నారు. ఇదిలా ఉంటే చంద్రబాబు చేసిన కుట్రల వల్ల నేడు పింఛన్‌దారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో తిరిగి జగన్ ప్రభుత్వం రాగానే ఇంటి వద్దనే పింఛన్లు అందజేస్తామన్నారు. ఆక్వాకల్చర్ డవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్‌నాయుడు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ పసల కనకసుందరరావు, ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు, సర్పంచ్‌లు పోలిమోను నాగ అంజూష, ఎలిపే గాంధీ, ములకాల సూర్యారావు, చింతా వెంకట్రావు, ఎమ్పీటీసీలు మార్లపూడి సుబ్బారావు, నార్ని శంకరరావు, సొసైటీ చైర్మన్లు పరిమి తులసీదాస్, వెలిశెట్టి నరనేంద్రకుమార్, గుమ్మళ్ల తాతారావు, నాయకులు ముప్పిడి వెంకట్రామిరెడ్డి (పెద్దబ్బులు), నూనె రాధాకృష్ణకుమారి, కొండుబోయిన కృపావరం, దారపురెడ్డి శ్రీనివాస్, దాకే పండియ్య, పోలిమోను శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం


తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్


కొండేపాడులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కొట్టు విశాల్


ఇరగవరంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


తణుకులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి కారుమూరి అల్లుడు దిలీప్‌కుమార్

తణుకు టౌన్: రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను ఇంటి గడప వద్దకే అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేసేందుకు ప్రజలంతా ఓట్లేసి గెలిపించాలని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ కోరారు. గురువారం సాయంత్రం తణుకు దువ్వ గ్రామంలో ఆయన ఇంటింటికి తిరిగి వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, సొసైటీ అధ్యక్షుడు జేకే రాజు, ఉప సర్పంచ్ కడియం వీరబాబు, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గోపాల కృష్ణ, ఎంపీటీసీలు పెనుమాక అశోక్, శ్రీనివాస్, మండల రైతు విభాగం అధ్యక్షుడు దండు కృష్ణంరాజు, శెనగన ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు. తణుకురూరల్ మండలం వేల్పూరు గ్రామంలో రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అల్లుడు దిలీప్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, పార్టీ నాయకులు, కార్యకర్తల ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, వైస్ ఎంపీపీ ఐశెట్టి శేషుకుమారి, ఎంపీటీసీ సభ్యులు చుండ్రు శ్యామల, తాడిపర్తి సుజాత, కోఆప్షన్ సభ్యుడు కే జస్పాల్, ఏఎంసీ డైరెక్టర్ బండి పార్వతి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం జగన్ పేదల పక్షపాతి

ఇరగవరం: పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఇరగవరం మండల వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. గురువారం ఇరగవరం మండలంలోని 21 గ్రామాల్లో ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగ తాయారు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు వెలగల సాయిబాబా రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, కె ఇల్లిందలపర్రు, ఇరగవరం సొసైటి అధ్యక్షుడు మల్లిరెడ్డి నాగార్జున, చవ్వాకుల శ్రీనివాస్, సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, ఎఎంసీ ఉపాధ్యక్షుడు మామిడిశెట్టి శ్రీనివాస్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు కుడిపూడి నాగ సత్యనారాయణ పాల్గొన్నారు.

సంక్షేమమే వైఎస్సార్ సీపీ ధ్యేయం

తణుకు అర్బన్: తణుకు 19, 20 వార్డుల్లో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అల్లుడు ఎ.దిలీప్‌కుమార్ పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి తణుకు అసెంబ్లీ అభ్యర్థి మంత్రి కారుమూరి, నరసాపురం ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాలను గెలిపించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, నియోజకవర్గ మైనారిటీ సెల్ మహిళాధ్యక్షురాలు షేక్ ఫహీమా, 19వ వార్డు నాయకులు న్యాయవాది బలిజేపల్లి రవిశంకర్, కొమ్మోజు రామకృష్ణ, 20వ వార్డు నాయకుడు చింతలపూడి మహేష్, నాయకులు తిర్రే విజయకృష్ణ, తాటిపర్తి వాసు, సామంతుల అప్పారావు, కారుమంచి మిత్ర, అప్పన్న, అరవింద్, చంద్రకళ పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

పెంటపాడు: సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ యువనేత కొట్టు విశాల్ పేర్కొన్నారు. పెంటపాడు మండలంలో బి. కొండేపాడు, రామచంద్రపురం, మీనవిల్లూరు, కోరిమిల్లి, చింతపల్లి గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కైగాల శ్రీనివాస్, గుండుమోగుల సాంబయ్య, మిరియాల శేషు, పార్టీ నాయకులు దేవరశెట్టి రాంబాబు, పాలా గణపతి, ఎంపీటీసీ సభ్యులు దేవరశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

కేఎస్‌ఎన్‌పై కూటమి ప్రేలాపనలు మానుకోవాలి

పెంటపాడు: రాజకీయాల్లో వాస్తవాలు మాట్లాడాలి, ప్రజాసంక్షేమం కోసం పాటుపడాలి. ఆ లక్షణాలు పుష్కలంగా ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు ఉన్నాయని వైఎస్సార్ సీపీ నాయకుడు గుండుబోగుల నాగు పేర్కొన్నారు. గురువారం ఆయన గడెంలో ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ స్వగృహం వద్ద మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రిపై, ఆయన తనయుడు కొట్టు విశాల్‌పై ప్రతిపక్ష నాయకుల ప్రేలాపనలు మానుకోవాలన్నారు. గూడెం చరిత్రలో ఎన్నో హత్యా రాజకీయాలు జరిగాయని, ప్రస్తుత కూటమిలో జైలు శిక్షపడిన వారు కూడా ఉన్నారని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ రాజకీయాల్లోకి వచ్చాక రౌడీ ఇజాన్ని రూపుమాపారని అన్నారు. ప్రజల రక్షణ కోసం కొట్టు పాటుపడ్డారని పేర్కొన్నారు. అధికారంలోకి వస్తున్నామన్న భ్రమలో మున్సిపల్ స్థలాలను పంచుకునేందుకు ప్రతిపక్ష నాయకులు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోందన్నారు.



వ్యవసాయం దండగంటూ మాజీ సీఎం చంద్రబాబు సాగును నిర్వీర్యం చేస్తే.. విత్తు నుంచి విక్రయం దాకా అడుగడుగునా అన్నదాతకు వెన్నుదన్నుగా నిలిచి వ్యవసాయాన్ని పండగ చేశారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. పెట్టుబడుల కోసం అప్పులు చేయాల్సిన పనిలేకుండా వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా ఏటా రూ.13,500 సాయం అందిస్తున్నారు. వచ్చే సీజన్ నుంచి అదనంగా మరో రూ.2,500 జోడించి ఈ సాయాన్ని రూ.16,000 చొప్పున అందించనున్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చడం పట్ల అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతుకు కొండంత భరోసా

- రూ.16 వేలకు రైతు భరోసా పెంపు
- ఐదేళ్లలో రైతులకు చేకూరే లబ్ధి రూ.944 కోట్లు
- మేనిఫెస్టోలో ప్రకటించిన సీఎం వైఎస్ జగన్
- సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు
- ప్రభుత్వంపై రూ.146.5 కోట్ల అదనపు భారం

గత ఐదేళ్లలో అందించిన రైతు భరోసా సాయం

సంవత్సరం	రైతులు	ప్రభుత్వ సాయం రూ. కోట్లలో
2019-20	1,09,302	147.56
2020-21	1,24,664	168.3
2021-22	1,17,791	159.02
2022-23	1,13,597	153.36
2023-24	1,24,645	168.17



అన్నదాతలను అక్కున చేర్చుకునేలా..

రైతులకు రూ.944 కోట్ల మేర లబ్ధి..

సాక్షి, భీమవరం: గతంలో సీజన్ ప్రారంభంలో పెట్టుబడుల కోసం రైతులు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. దీంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల మేనిఫెస్టోలో వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ఏడాదికి రూ.10 వేలు చొప్పున ఐదేళ్లలో రూ.50,000 ఇస్తామని అప్పుడు హామీ ఇచ్చారు. ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే చెప్పిన దానికంటే మిన్నగా ఏటా రూ.13,500 చొప్పున ఐదేళ్లలో ఒక్కో రైతుకు రూ.67,500 చొప్పున సాయం అందించారు. దీంతో జిల్లాలోని సగటున 1,17,999 మంది రైతులకు సీఎం జగన్ పాలనలో రూ.796.49 కోట్లు లబ్ధి చేకూరింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లలో అన్నదాతలను అక్కున చేర్చుకునేలా పాలన సాగించారు. వారికి అన్ని విధాల అండగా నిలిచి భరోసా అందించారు. రైతులకు కోట్లాది రూపాయల పంట రుణాలు, వడ్డీ రాయితీ పంపిణీ చేశారు. 1,14,011 మంది రైతులకు రూ.217.64 కోట్లు ఉచిత పంటల బీమా అందించగా, 1,40,015 మంది రైతులకు రూ.103.47 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ అందించారు. యాంత్రీకరణలో భాగంగా 248 కస్టమ్ హైరింగ్ సెంటర్ల (సీహెచ్‌సీ) ద్వారా 40 శాతం సబ్సిడీపై రైతులకు రూ.20.7 కోట్ల విలువైన వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 253 పంచాయతీల పరిధిలో రూ.65 కోట్ల వ్యయంతో 298 రైతు భరోసా కేంద్ర భవన నిర్మాణాలు చేపట్టి ఇప్పటికే 215 భవనాలను వినియోగంలోకి తెచ్చారు. రానున్న సీజన్ నుంచి రైతు భరోసా సాయం రూ.16 వేలకు పెంచుతున్నట్టు ఎన్నికల మేనిఫెస్టోలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. దీంతో రానున్న ఐదేళ్లలో ఒక్కో రైతుకు రూ.80 వేల వరకు సాయం అందనుంది. ఈ మేరకు జిల్లాలోని రైతులకు రూ.944 కోట్ల లబ్ధి చేకూరనుంది. ఏడాదికి ఒక్కో రైతుకు పెరిగిన రూ.2500 సాయంతో ఐదేళ్లలో ప్రభుత్వంపై రూ.146.5 కోట్ల అదనపు భారం పడనుంది.

అండగా నిలిచారు



సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే రైతులకు అండగా నిలిచారు. రైతుభరోసా కేంద్రాల ఏర్పాటు అభినందనీయం. గతంలో ఏ ప్రభుత్వం ఇలా రైతులను ఆదుకోలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అందిస్తున్న పథకాలు హర్షణీయం.
– నత్తి సత్యనారాయణ రెడ్డి, చిన్నావారిపాలెం

రూ.16 వేలకు పెంపు బాగుంది



రైతుకు పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా సాయాన్ని రూ.16 వేలకు పెంచడం బాగుంది. విత్తనాలు కొనుగోలు చేయడం, నారుమడి సిద్ధం చేసుకోవడం చేపట్టేందుకు రైతు భరోసా సొమ్ములు ఉపయోగపడుతున్నాయి.
– పోతుల వెంకటేశ్వరరావు, పసలదీవి

ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాం



రైతు భరోసా పథకం సన్న, చిన్న కారు రైతులకు ఎంతో ఆసరాగా ఉంది. సీఎం జగన్ తెచ్చిన ఈ పథకం ద్వారా రైతులు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. మేనిఫెస్టోలో రైతు భరోసా కింద రైతులకు రూ.16,000 అందజేస్తామనడం మరింత ఊరట ఇస్తుంది.
– బోదనబోయిన రామాంజనేయులు, మండపాడు

వ్యవసాయానికి పెద్ద పీట



సీఎం జగన్ వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నారు రైతు భరోసాను రూ.16 వేలకు పెంచారు. సీఎం జగన్ మాటకు కట్టుబడి ఉంటారు. రైతులకు మేలే చేసేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే.
– పిప్పల లక్ష్మణ్, వదలి

జగన్ రైతుల పక్షపాతి



సీఎం వైఎస్ జగన్ రైతుల పక్షపాతిగా పనిచేస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా.. విత్తనం దగ్గర నుంచి ధాన్యం కొనుగోలు వరకు ప్రభుత్వం రైతు వెన్నంటే ఉండి పనిచేసే విధంగా చక్కటి వ్యవస్థను ఏర్పాటు చేశారు. జగన్‌కు రైతులు రుణపడి ఉంటారు.
– బైనపాలెం పండు, ఎల్‌బీ చర్ల

అప్పుల భారం లేదు



పెట్టుబడి సాయం కింద సీఎం వైఎస్ జగన్ ప్రతి రైతుకి ఏడాదికి రూ.13,500 సాయం అందిస్తుండటంతో రైతులకు అప్పులభారం లేదు. గతంలోని ప్రభుత్వాలు ముందస్తు సాగు చేయమని చెప్పడమే తప్ప ఏనాడు రైతులను ఆదుకునేందుకు ముందుకు వచ్చింది లేదు.
– ముప్పిడి కుమార్, గుంపర్రు

పెంపు హర్షణీయం



ఐదేళ్లుగా నాకు ఏటా రూ.13,500 చొప్పున వైఎస్సార్ రైతు భరోసా సాయం అందుతోంది. వ్యవసాయ పెట్టుబడుల కోసం ఎంతో ఉపయోగపడుతుంది. వచ్చే సీజన్ నుంచి రూ. 16000 చేయనున్నట్టు సీఎం జగన్ ప్రకటించడం హర్షణీయం.
– చంద్రు వెంకట సత్యనారాయణ, రైతు, వేల్పూరు, తణుకు మండలం

కొనసాగింపు.. మంచి నిర్ణయం



రైతు భరోసా పథకాన్ని కొనసాగిస్తూ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించడం చాలా మంచి నిర్ణయం. ఇప్పటివరకు ఏటా రూ.13,500 చొప్పున అందేవి. రానున్న ఐదేళ్ల పాటు ఏటా రూ.16 వేలు జమ చేస్తామని ప్రకటించడం అభినందనీయం.
– నలుమూరి గోవిందరావు, రైతు, అత్తిలి

జగన్ పాలనే రైతులకు భరోసా



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన రైతులకు భరోసా ఇస్తుంది. ఇటీవల మేనిఫెస్టోలో రైతులకు భరోసానిస్తు జగన్ చేసిన ప్రకటనలు రైతులకు మరింత ఆనందాన్నిస్తున్నాయి. ఏడాదికి రూ.16,000 చొప్పున ఐదేళ్లలో రూ.80 వేలు ఇస్తానని ప్రకటించడం ఆనందదాయకం.
– చిత్తలూరి రామకృష్ణ, బొండాడ

తీరంలో పర్యాటక శోభ

- పేరుపాలెం బీచ్ అభివృద్ధిపై సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ
- జాతీయ స్థాయిలో అభివృద్ధి దిశగా అడుగులు
- బ్లూఫాగ్ గుర్తింపునకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ



పేరుపాలెం బీచ్‌లో ఏర్పాటుచేసిన వైఎస్సార్ కాంస్య విగ్రహం

నరసాపురం: ఉమ్మడి పశ్చిమలో 19 కిలోమీటర్లు తీరప్రాంతం ఉన్న ఏకైక ప్రాంతం నరసాపురం. ఇక మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఏటా లక్షల్లో వచ్చే సందర్శకులతో రాష్ట్ర స్థాయిలో ఈ బీచ్ ఇప్పటికే ప్రత్యేకను చాటుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ కృషితో బీచ్ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేందుకు చేసిన ప్రయత్నం ఫలిచడంతో గోదావరి జిల్లాల్లోనే ముఖ్య పర్యాటక కేంద్రంగా పేరుపాలెం బీచ్ గడిచిన ఐదేళ్లలో పేరుగడించింది.

వైఎస్సార్ హయాంలో బీచ్ అభివృద్ధికి బీజం

ఇప్పుడు సందర్శకులను ఇంతలా ఆకర్షిస్తున్న పేరుపాలెం బీచ్‌కు 2006 వరకూ పెద్దగా గుర్తింపులేదు. బీచ్‌కు అనుసంధానంగా సరైన రహదారులు కూడా లేవు. నియోజకవర్గానికి 35 ఏళ్లపాటు ప్రాతినిధ్యం వహించిన టీడీపీ నాయకులు బీచ్ అభివృద్ధిపై దృష్టిపెట్టిన దాఖలాలు లేవు. 2006లో బీచ్ ప్రాంతానికి వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరెడ్డి మొదటిసారిగా మెట్టిరేవు, మోళ్లపర్రు మీదుగా 3.50 కిలోమీటర్ల మేర బీచ్‌రోడ్డుకు రూ.2.86 కోట్లు మంజూరు చేయడం, వెంటనే రోడ్డు నిర్మాణం చేయడంతో రోడ్డు సౌకర్యం మెరుగయ్యింది. అప్పటి నుంచి బీచ్‌కు సందర్శకుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. ప్రతి ఏటా ఒక్క కార్తీక మాసంలోనే పేరుపాలెం బీచ్‌ను 3 లక్షల మంది వరకూ సందర్శిస్తారు. ఇక వారాతంరాలు, సెలవు దినాలు, పండుగల సమయంలో ఇతర జిల్లాల నుంచి కూడా పెద్ద ఎత్తున పర్యాటకులు సందర్శిస్తారు.

ఫెస్టివల్ నిర్వహణతో బీచ్‌కు మహర్దశ

2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పీఠం ఎక్కిన తొలినాళ్లలోనే బీచ్ అభివృద్ధిపై దృష్టి పెట్టడం విశేషం. 2020 ఫిబ్రవరిలో రాష్ట్ర ప్రభుత్వం పేరుపాలెంలో బీచ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించింది. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన పర్యాటకులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి హాజరవ్వడంతో బీచ్ ప్రత్యేకత మరింత పెరిగింది. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్టణం, అటు తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ బీచ్‌లతో పాటుగా పేరుపాలెం బీచ్‌కు బ్లూఫాగ్ గుర్తింపు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. దీంతో 2020 డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం నియమించిన బ్లూఫాగ్ బృందం తీరంలో పర్యటించింది. పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు బీచ్‌లు అనుకూలంగా ఉన్నాయని బృందం సభ్యులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. విశాఖ ఏ గ్రేడ్‌గాను, కాకినాడ, పేరుపాలెం బీచ్‌లు బీ గ్రేడ్‌గాను బ్లూఫాగ్ గుర్తింపునకు ఎంపికయ్యాయి. బ్లూఫాగ్ గుర్తింపు లభించిన నేపథ్యంలో బీచ్‌లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఏడాదికి రూ.కోటి నుంచి రూ.3 కోట్ల వరకూ నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరుకానున్నాయి.

పలు రహదారుల నిర్మాణం..

కేవలం బ్లూఫాగ్ గుర్తింపు ప్రయత్నం, బీచ్ ఫెస్టివల్ నిర్వహణతోనే రాష్ట్ర ప్రభుత్వం సరిపెట్టలేదు. అటు జిల్లా కేంద్రం భీమవరం, ఇటు డివిజన్ కేంద్రం నరసాపురం ప్రాంతాల నుంచి బీచ్ రోడ్డు అనుసంధానంగా పలు రహదారుల నిర్మాణాలకు రూ.75 కోట్లు 2023 ఏప్రిల్‌లో ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో రోడ్ల నిర్మాణాలు చురుగ్గా సాగాయి. అలాగే బీచ్‌లో రాష్ట్ర టూరిజంశాఖ అందాల రిసార్ట్స్ నిర్మించింది. వీఐపీ గెస్ట్‌హౌస్ నిర్మాణం చేశారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో రాబోయే 5 ఏళ్లలో రూ.40 కోట్లతో ఫైవ్‌స్టార్ హోటల్స్, రిసార్ట్స్, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. పేరుపాలెం బీచ్ నుంచి కేపీపాలెం బీచ్ వరకు ఉన్న 3.5 కిలోమీటర్ల రహదారిని రూ.3 కోట్లతో డబుల్ రోడ్‌గా నిర్మించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయంలో మొదలైన బీచ్ అభివృద్ధిని జగన్‌మోహన్‌రెడ్డి ఇంకా ముందుకు తీసుకెళ్లడం విశేషం. కేపీపాలెం బీచ్‌లో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 20 అడుగుల కాంస్యం విగ్రహం ఏర్పాటుతో పాటు ఆయన జీవిత విశేషాలను తెలియజేసేలా మ్యూజియం ఏర్పాటు చేశారు.

ముఖ్య పర్యాటక కేంద్రంగా మారింది



పేరుపాలెం బీచ్ గోదావరి జిల్లాలోనే ముఖ్య పర్యాటక కేంద్రంగా మారింది. బ్లూఫాగ్ గుర్తింపుతో దేశంలోని ముంబాయి, చెన్నై లాంటి ప్రముఖ బీచ్‌ల జాబితాలో పేరుపాలెం చేరినట్టయ్యింది. బీచ్‌కు అనుసంధానంగా రోడ్డును నిర్మించడానికి మొదటిసారిగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నిధులు ఇచ్చారు. మళ్లీ ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీచ్ అభివృద్ధికి సహకరించారు. ఇప్పుడు పేరుపాలెం బీచ్ గోదావరి జిల్లాలోనే ఓ బ్రాండ్.
– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్



పేరుపాలెం బీచ్‌లో ఇప్పటికే టూరిజం శాఖ ఆధ్వర్యంలో అందంగా నిర్మించిన రిసార్ట్స్

బీచ్ అభివృద్ధికి జగన్ సర్కార్ తీసుకున్న నిర్ణయాలు

- 2020 ఫిబ్రవరిలో ఫెస్టివల్ నిర్వహించడం ద్వారా బీచ్‌కు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకు రావడం.
- రూ.కోటి వ్యయంతో వైఎస్సార్ స్మృతి వనం, మ్యూజియం ఏర్పాటు
- రానున్న ఐదేళ్లలో ప్రైవేట్ భాగస్వామ్యంతో బీచ్‌లో రూ.40 కోట్ల వ్యయంతో రిసార్ట్స్, హోటల్స్ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం
- బీచ్‌కు అనుసంధానంగా రూ.4.50 కోట్లతో రహదారి నిర్మాణం
- ముత్యాలపల్లి, మోడి వయా పేరుపాలెం బీచ్ రోడ్డు నిర్మాణానికి రూ.28 కోట్లు కేటాయింపు
- మెట్రేవు, అల్లంవారి మెరక మీదుగా పేరుపాలెం బీచ్ రోడ్డుకు రూ.8 కోట్లు కేటాయింపు
- బియ్యపుతిప్ప, వేములదీవి, చినమైనవానిలంక, పెదమైనవానిలంక గ్రామాల నుంచి పేరుపాలెం బీచ్‌ను కలుపుతూ రూ.4.50 కోట్లతో రహదారి నిర్మాణం

చిరుద్యోగులకూ సంక్షేమ బాసట

- ఇకపై అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకూ నవరత్నాల లబ్ధి
- మేనిఫెస్టోలో జగన్ ప్రకటించడంపై సర్వత్రా హర్షం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5,034 మందికి లబ్ధి



ఏలూరు (మెట్రో): చాలీచాలని జీతాలతో ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్న చిరుద్యోగులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బాసటగా నిలవనుంది. ఇప్పటివరకు ఏ ప్రభుత్వమూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పట్టించుకోలేదు. వారికి ఆదాయం బాగానే వస్తుందన్న రీతిలో ప్రభుత్వం నుంచి అందే ఏ ఒక్క ప్రయోజనం చేకూర్చలేదు. దీనికి భిన్నంగా వైఎస్సార్ సీపీ వారికి కూడా సంక్షేమ పథకాలు అందించేందుకు చర్యలు తీసుకోనుంది. ప్రజలందిరకీ లబ్ధి చేకూర్చే పథకాలను ప్రభుత్వ జీతం అందుకునే చిరుద్యోగులకు సైతం అందే విధంగా చర్యలు తీసుకోబోతోంది. ఈమేరకు వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలో ప్రకటించింది. నవరత్నాలైన విద్య, వైద్యం, వ్యవసాయం, ఉన్నత విద్య, పేదలందరికీ ఇళ్లు, మహిళా సాధికారత, సామాజిక భద్రత, అభివృద్ధి, నాడు–నేడు ఇలా నవరత్నాలను జగన్ ప్రభుత్వం అమలు చేస్తోంది. వీటిలో అర్హత కలిగి, లబ్ధి చేకూర్చే అన్ని పథకాలను ఆప్కాస్ ద్వారా జీతాలు పొందే చిరుద్యోగులకు అందించాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా రేషన్ కార్డుకు, సొంత ఇంటి కల సాకారానికి, ఆరోగ్య శ్రీ వంటి వైద్యసేవలకు, చిరుద్యోగుల పిల్లల ఉన్నత చదువులకు ఇలా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు రానున్న రోజుల్లో చిరుద్యోగులకు సైతం అందనున్నాయి.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల హర్షం

ఆప్కాస్ ద్వారా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఏలూరు జిల్లా వ్యాప్తంగా 3060 ఉంటే, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5034 మంది ఉన్నారు. వీరికి ఒక్కొక్క ఉద్యోగికి సుమారు రూ.22 వేల జీతాన్ని ప్రభుత్వం అందిస్తోంది. రానున్న రోజుల్లో ప్రతి ఒక్క ఉద్యోగి కుటుంబాలకు నవరత్నాల ద్వారా లబ్ధి చేకూర్చే విధంగా జగనన్న సర్కారు చర్యలు తీసుకోబోతోంది. ఆప్కాస్ ఉద్యోగులకు నవరత్నాల ద్వారా లబ్ధి చేకూర్చేందుకు వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో రూపొందించడం పట్ల జిల్లాలోని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. గతంలో కేవలం తాము జీతాలు తక్కువ తీసుకుంటున్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగిగా ముద్ర పడటంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏవీ తమ దరికి చేరేవి కావని, ఇకపై నవరత్నాలు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు అందించేందుకు చర్యలు తీసుకునేలా మేనిఫెస్టో రూపొందించడం ఆనందంగా ఉందని వారు అంటున్నారు. దీని ద్వారా తమతో పాటుగా తమ కుటుంబాలకు సైతం లబ్ధి చేకూరుతుందని చెబుతున్నారు.

ప్రచార పర్వం

వైఎస్సార్ సీపీ నేతలు ప్రచార పర్వంలో దూసుకుపోతున్నారు. రాష్ట్ర అభివృద్ధికి సంక్షేమ పాలనకు మరోసారి పట్టం కట్టాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. జగన్ అంటే విశ్వసనీయతకు అర్థం అని.. మోసాలకు, అబద్ధాలకు మారుపేరైన చంద్రబాబు మాయమాటలను నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నారు. కూటమి హామీలన్ని బూటకమని, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని నేతలు కోరుతున్నారు.



తాడేపల్లిగూడెం రూరల్: పెదతాడేపల్లి జగన్మోహనపురంలో వీవీ ప్యాడ్‌పై ఉన్న గుర్తులను వివరిస్తున్న కొట్టు సత్యనారాయణ



ఉండి: కోలమూరులో పీవీఎల్ నరసింహరాజుకు హారతులు పడుతున్న మహిళలు



అత్తిలి: మంచిలి ప్రచారంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల



పెనుగొండ: అయోధ్యలంకలో దివ్యాంగుడితో మాట్లాడుతున్న శ్రీరంగనాథరాజు